క్లుప్తంగా

'కౌన్సిల్' సమావేశాన్ని ఏర్పాటు చేయాలి



అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేస్తున్న కార్పొరేటర్ భాగ్యలక్ష్మి

మలక్‌పేట: జీహెచ్‌ఎంసీ సర్వసభ్య సమావేశంలో ప్రజా సమస్యలపై చర్చ లేకుండానే ప్రతిపక్ష బీజేపీ కార్పొరేటర్లపై నిందమోపడం శోచనీయమని ఆపార్టీ మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని కృష్ణతులసినగర్‌లో సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ, స్థానిక సంస్థల హక్కులను కాలరాస్తూ మేయర్‌ను, కౌన్సిల్ సభ్యులను అవమాన పరుస్తూ చట్ట వ్యతిరేక నిర్ణయం తీసుకున్న అధికారిపై చర్యలు తీసుకోవాలని, కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ ట్యాంక్‌బండ్‌పై ఉన్న అంబేడ్కర్ విగ్రహానికి వినతి పత్రం ఇచ్చినట్లు కార్పొరేటర్ తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు చందు, గణేష్, సంతోష్, మల్లేష్, పరశురామ్, దినేష్ తదితరులు ఉన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీకి ఈనెల 31 లోపు ఎంట్రీ చేసుకోవాలి

మలక్‌పేట: రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ బ్యాడ్మింటన్ అసోసియేషన్, స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ స్టేట్ సహకారంతో జూన్ 2 నుంచి 4 తేదీ వరకు రంగారెడ్డి జిల్లా బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్-2023 నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కరెడ్ల శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర స్థాయి ఎంపిక కోసం టోర్నీ నిర్వహిస్తున్నామని, సబ్‌జూనియర్, జూనియర్, పురుషులు, మహిళలు, వెటరన్ బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్‌ల్లో పాల్గొనేందుకు ఈనెల 31 తేదీలోపు ఎంట్రీ చేసుకోవాలని సూచించారు. వివరాలకు 77889 93006, 98480 15443 సెల్ నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించాలి



మాట్లాడుతున్న మామిడి హరికృష్ణ

హస్తినాపురం: స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించి వాటిని వినియోగించుకున్నప్పుడే గ్రామీణ ప్రాంత ఉత్పత్తిదారులు అభివృద్ధి చెందుతారని భాషా సాంస్కృతిక శాఖ డైరక్టర్ మామిడి హరికృష్ణ అన్నారు. జాతీయ గీతం రచించిన రవీంద్రనాథ్ ఠాగూర్ జయంతి వేడుకలను స్థానిక ఉత్పత్తుల కేంద్రం నిర్వాహకుడు భరత్ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమానికి హరికృష్ణ ముఖ్యఅతిథిగా హాజరై రవీంద్రనాథ్ ఠాగూర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా హరికృష్ణ మాట్లాడుతూ, స్వాతంత్ర్య పోరాట సమయంలో గాంధీజీ స్థానిక ఉత్పత్తులను వినియోగించాలని పిలుపునిచ్చారని, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆయా సంఘాల ప్రతినిధులు ప్రభాకర్, శారద, ధీరజ్, శ్రీనివాసరావు, రమేశ్‌రెడ్డి, కాంతారావు, హరిగోపాల్ పాల్గొన్నారు.

ఘనంగా త్రినేత్ర ఆంజనేయ స్వామి జాతర



పూజలో పాల్గొన్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: బీఎన్‌రెడ్డి నగర్ డివిజన్ సాహెబ్ నగర్ త్రినేత్ర ఆంజనేయ స్వామి జాతర ఉత్సవాలను సోమవారం ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు కార్పొరేటర్‌ను శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ ఈఓ ప్రవీణ్‌కుమార్, సభ్యులు ఉమేష్‌గౌడ్, రాజశేఖర్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, మధు తదితరులు పాల్గొన్నారు.

కదం తొక్కిన నిరుద్యోగ యువత

- ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో మార్మోగిన సరూర్‌నగర్ స్టేడియం
- హైదరాబాద్ కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్‌కు యువత భారీ స్పందన



పాదయాత్రగా తరలివెళ్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావు ఠాక్రే



ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ ర్యాలీలో పాల్గొన్న రేవంత్‌రెడ్డి, మాణిక్‌రావు ఠాక్రే

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన యువసంఘర్షణ సభలో యువత కదం తొక్కింది. మహేశ్వరం, ఎల్‌బీనగర్, ఇబ్రహీంపట్నం, మలక్‌పేట నియోజకవర్గాల నుంచి యువత పెద్ద ఎత్తున తరలివచ్చింది. ర్యాలీలుగా స్టేడియానికి చేరుకున్నారు.

- ఎన్‌ఎస్‌యూఐ ఆధ్వర్యంలో యువకులు ర్యాలీలో పాల్గొని బీఆర్‌ఎస్ ప్రభుత్వంపై తీవ్ర విమర్శలు చేశారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేపర్ లీకేజీలతో నిరుద్యోగల జీవితాలతో ఆడుకుంటున్న ప్రభుత్వం వెంటనే గద్దె దిగాలని నినాదాలు చేశారు.
- ఎల్‌బీనగర్, సరూర్‌నగర్, కొత్తపేట, దిల్‌సుఖ్‌నగర్‌ల్లోని ప్రధాన రహదారులు సభాస్థలికి వచ్చేవారితో పూర్తిగా నిండిపోయాయి. నిరుద్యోగులకు నిరాశను మిగిల్చిన బీఆర్‌ఎస్‌కు బైబై అంటూ నినదించారు.
- నిరుద్యోగులకు కాంగ్రెస్ డిక్లరేషన్ ఆశాజనకంగా ఉందని, హైదరాబాద్ డిక్లరేషన్‌తో నిరుద్యోగ యువతకు ఎంతో ఓదార్పునిస్తున్నాయన్నారు. ఎనిమిదేళ్లుగా రాష్ట్రంలోని నిరుద్యోగులను మరిచి వారి జీవితాలతో బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఆడుకుంటోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.
- హైదరాబాద్ డిక్లరేషన్‌ను ప్రియాంక గాంధీ ప్రకటించినప్పుడు సభలోని యువకుల నుంచి భారీ స్పందన లభించింది, డిక్లరేషన్‌కు చప్పట్లతో సభ మార్మోగింది.
- యువకుల నృత్యాలు, ఆటపాటలతో సభా ప్రాంగణం దద్దరిల్లిపోయింది.

ర్యాలీలతో దద్దరిల్లిన ఎల్‌బీనగర్ చౌరస్తా

మన్సూరాబాద్: సరూర్‌నగర్ స్టేడియంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన నిరుద్యోగ యువ సంఘర్షణ సభకు ఎల్‌బీనగర్ నుంచి కాంగ్రెస్ నేతలు, కార్యకర్తలు భారీ స్థాయిలో తరలివెళ్లారు. కాంగ్రెస్ నేతల ర్యాలీలు, పాదయాత్రలతో ఎల్‌బీనగర్ చౌరస్తా దద్దరిల్లిపోయింది. టీపీసీసీ అధ్యక్షుడు ఎనముల రేవంత్‌రెడ్డి, రాష్ట్ర ఇన్‌చార్జి మానిక్‌రావు ఠాక్రే ఎల్‌బీనగర్‌లోని శ్రీకాంత్‌చారి విగ్రహానికి నివాళులర్పించి పాదయాత్రగా సరూర్‌నగర్ స్టేడియంకు తరలివెళ్లారు. మరోవైపు కాంగ్రెస్ శాసన సభా పక్ష నేత మల్లు భట్టివిక్రమార్క ఎల్‌బీనగర్ హిమగిరి గార్డెన్స్ నుంచి పాదయాత్రగా సరూర్‌నగర్ స్టేడియంకు తరలివెళ్లారు. నాయకులు పాదయాత్రలతో ఎల్‌బీనగర్ చౌరస్తా సమీప ప్రాంతాలు ట్రాఫిక్‌లో చిక్కుకపోయాయి. కిలో మీటర్ల మేర ట్రాఫిక్ స్తంభించిపోయింది. కాంగ్రెస్ పార్టీ ఎల్‌బీనగర్ ఇన్‌చార్జి జక్కిడి ప్రభాకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎల్‌బీనగర్ నుంచి సరూర్‌నగర్ స్టేడియం వరకు భారీ ర్యాలీతో తరలివెళ్లారు.



సరూర్‌నగర్ సభాప్రాంగణం బయట దృశ్యం



జెండాలు చేపట్టి సరూర్‌నగర్ సభాప్రాంగాణానికి ర్యాలీగా చేరుకుంటున్న యువకులు

కాంగ్రెస్ శ్రేణుల సందడి

- 'యూత్ డిక్లరేషన్'కు భారీగా తరలివచ్చిన నాయకులు, అభిమానులు
- ఎల్‌బీనగర్ పరిసరాల్లో ట్రాఫిక్ జామ్



ఎల్బీనగర్ ఫ్లైఓవర్‌పై స్తంభించిన ట్రాఫిక్

నాగోలు, చైతన్యపురి: ఎల్‌బీనగర్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియం ప్రాంగణంలో సోమవారం సాయంత్రం జరిగిన కాంగ్రెస్ పార్టీ యూత్ డిక్లరేషన్ సభకు భారీగా తరలివచ్చారు.

- సభా ప్రాంగణం పరిసరాల్లో భారీ ఫ్లెక్సీలతో పాటు కాంగ్రెస్ జెండాలను ఏర్పాటు చేశారు.
- ప్రియాంక గాంధీ సభ ప్రారంభం కాక ముందు పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి పలువురు నాయకులు శ్రీకాంతాచారి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.
- నగరంలోని వివిధ ప్రాంతాల నుంచే కాకుండా జిల్లాల నుంచి కాంగెస్ పార్టీ నాయకులు ర్యాలీగా సభకు తరలివచ్చారు.
- కొత్తపేట, ఎల్‌బీనగర్, హస్తినాపురం, వనస్థలిపురం, హయత్‌నగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ జామ్ అయింది.
- ఫ్లైఓవర్లు, పలు రహదారులు వాహనాలతో నిండిపోయి, ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడ్డాయి. పోలీసులు ట్రాఫిక్ నియంత్రించలేక చేతులెత్తేశారు.
- వాహనాలను దారి మళ్లించడం, నియంత్రించకపోవటం వల్ల ఆసుపత్రులకు రోగులను తీసుకెళ్లే అంబులెన్స్‌లకు సైతం ఇబ్బందులు ఏర్పడ్డాయి.
- సభా ప్రాంగణం పరిసరాల్లో సర్వీస్ రోడ్లు, జాతీయ రహదారులపై వాహనాలు ఎక్కడబడితే అక్కడ పార్కు చేయటంతో సాధారణ ప్రజల రాకపోకలకు అవస్థలు పడ్డారు.

కాంగ్రెస్ విజయభావుటా ఎగురవేయడం తథ్యం



మలక్‌పేట నుంచి కార్యకర్తలతో తరలివెళ్తున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చేకోలేకర్ శ్రీనివాస్

మలక్‌పేట: రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయ భావుటా ఎగురవేయడం ఖాయమని టీపీసీసీ ప్రధానకార్యదర్శి, మలక్‌పేట ఇన్‌చార్జి చేకోలేకర్ శ్రీనివాస్ అన్నారు. సరూర్‌నగర్ స్టేడియంలో జరిగిన ప్రియాంకగాంధీ యువ సంఘర్షణ సభకు సోమవారం నియోజక వర్గం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలతో తరలివెళ్లారు. మూసారంబాగ్, సలీంనగర్ బైక్ ర్యాలీ నిర్వహించారు.

కాంగ్రెస్‌తోనే యువతకు న్యాయం: దేప



దిల్‌సుఖ్‌నగర్: హైదరాబాద్ కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్‌తో నిరుద్యోగులకు న్యాయం జరుగుతుందని మహేశ్వరం నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి అన్నారు. సోమవారం సరూర్‌నగర్‌లో నిర్వహించిన యువ సంఘర్షణ సభకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి పార్టీ సీనియర్ నాయకుడు దేప భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎన్‌టీఆర్‌నగర్‌లోని రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళులర్పించి అక్కడి నుంచి యువత భారీ ఎత్తున ర్యాలీగా తరలివెళ్లారు.

రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడటమే లక్ష్యం

ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి



సహారాస్టేట్స్‌కాలనీలో రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

మన్సూరాబాద్: భవిష్యత్ తరాలను దృష్టిలో పెట్టుకుని ప్రణాళికబద్ధంగా నియోజకవర్గంలో అభివృద్ధి పనులు చేపడుతున్నామని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి స్పష్టం చేశారు. మన్సూరాబాద్ డివిజన్ పరిధిలో సుమారు రూ.2.63కోట్లతో చేపడుతున్న అభివృద్ధి పనులకు సోమవారం ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నియోజకవర్గంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను ఒక్కొక్కటిగా పరిష్కరించానని తెలిపారు. నియోజకవర్గాన్ని రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దడమే తన లక్ష్యమన్నారు. మన్సూరాబాద్ డివిజన్‌లో ఇంటింటికీ తాగునీరు అందిస్తున్నామని, డివిజన్ హయత్‌నగర్ పరిధిలో సుమారు 15 కిలో మీటర్ల మేర నూతన మంచినీటి పైప్‌లైన్లు వేశామని, మరో 10కిలో మీటర్ల పనులు జరుగుతున్నాయన్నారు. వర్షపు నీరు కాలనీల్లో చేరకుండా క్రీడా నుంచి హతిగూడ చెరువు వరకు వరద కాలువ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని, త్వరలో పనులు చేపడతామన్నారు. మంచినీరు, డ్రైనేజీ ఏర్పాటు చేశాకే సీసీ రోడ్డు పనులు చేపడతామన్నారు. బాలాజీనగర్ నుంచి హతిగూడ చెరువు మీదుగా ప్రత్యేక డ్రైనేజీ ట్రంక్‌లైన్ ఏర్పాటు చేస్తామని స్పష్టంచేశారు. కార్యక్రమంలో కార్పొరేటర్ కొప్పుల నర్సింహారెడ్డి, మాజీ కార్పొరేటర్ కొప్పుల విఠల్‌రెడ్డి, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు జక్కిడి మల్లారెడ్డి, పోచబోయిన ఈశ్వరమ్మ యాదవ్, నాయకులు జగదీష్‌యాదవ్, టంగుగూరి నాగరాజు, రఘువీర్‌రెడ్డి, నాంపల్లి రామేశ్వర్, కాలనీలవాసులు కరణం శ్రీకాంత్, వల్లూరిపల్లి పార్థసారథి, జగత్‌రెడ్డి, రఘు, సత్యనారాయణ, సాయిలుగౌడ్, శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గోనె సాల్మన్‌రాజ్‌కు క్రిస్టియన్ ఎమ్మెల్సీగా అవకాశం కల్పించాలి

రెవరెండ్ డాక్టర్ ఎంఎస్ ప్రభుచరణ్



సమావేశంలో మాట్లాడుతున్న అధ్యక్షుడు ఎంఎస్ ప్రభుచరణ్

మలక్‌పేట: క్రిస్టియన్ ఎమ్మెల్సీగా బీఆర్‌ఎస్ నేత గోనె సాల్మన్‌రాజ్‌కు అవకాశం కల్పించాలని ఇండిపెండెంట్ పాస్టర్స్ ఫెలోషిప్ నిర్ణయం తీసుకుందని తెలంగాణ అధ్యక్షుడు, రెవరెండ్ డాక్టర్ ఎంఎస్ ప్రభుచరణ్ తెలిపారు. మూసారంబాగ్‌లోని క్రిస్టియన్ లైఫ్ సెంటర్ చర్చిలో సోమవారం జరిగిన ఫెలోషిప్ సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. క్రైస్తవుల మధ్య ఐక్యతను పెంపొందించి, సమాజ భద్రత, శ్రేయస్సు కోసం నిరంతరం కృషి చేస్తున్న తెలంగాణ యునైటెడ్ క్రిస్టియన్స్ అండ్ పాస్టర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ సాల్మన్‌రాజ్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలని ముఖ్యమంత్రి కేసీఆర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈసారి దక్షిణ తెలంగాణ ప్రాంతానికి చెందిన వ్యక్తికి ఎమ్మెల్సీ స్థానం కల్పించాలని సీఎంను కోరారు. సమావేశంలో పాస్టర్లు శ్యామ్ అబ్రాహం, సుదర్శన్, యేసుబాబు, ప్రభు, రాజ్ కిరణ్, జాన్, వన్య ఇమ్మానియేల్, తదితరులు పాల్గొన్నారు.

నిర్మాణ వ్యర్థాల డంపింగ్‌తో ప్రయాణికులకు ఇక్కట్లు



హయత్‌నగర్ బాతుల చెరువు కట్టకింద డంపింగ్ చేసిన నిర్మాణ వ్యర్థాలు

హయత్‌నగర్: హయత్‌నగర్‌లోని బాతుల చెరువు కట్టకింద ఉన్న తొర్రూర్ రోడ్డు పక్కన నిత్యం నిర్మాణ వ్యర్థాలను డంపింగ్ చేస్తుండటంతో ఆ రోడ్డు వెంట వెళ్లే ప్రయాణిలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. నిర్మాణాలు కూల్చి వేసిన అనంతరం మిగిలిన కాంక్రీట్, మట్టి తదితర వ్యర్థాలతో పాటు చెత్తాచెదారం తీసుకొచ్చి రోడ్డు పక్కన వేస్తున్నారు. కొంత కాలంగా ఈ డంపింగ్ కొనసాగుతున్నా... అటు ఆర్ అండ్ బీ అధికారులు గానీ, మున్సిపాలిటీ అధికారులుగానీ పట్టించుకోకపోవడంతో కుప్పలుగా కుప్పలుగా డంపింగ్ వ్యర్థాలు పేరుకుపోతున్నాయి. రోజు రోజుకూ డంపింగ్ ఎక్కువ అవుతుండడంతో ఆ రోడ్డుపై వెళ్లే ప్రయాణికులు తీవ్ర కష్టాలను ఎదుర్కొంటున్నారు. రోడ్డుపైకి రాళ్లు, దుమ్ము, ధూళి వస్తుండటంతో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. తీవ్ర ట్రాఫిక్‌కు తోడుగా రోడ్డు పక్కన డంపింగ్ కారణంగా రోడ్డు మరింత ఇరుకుగా మారి తరుచూ ట్రాఫిక్ జామ్ అవుతోందని స్థానికులు తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డుపక్కన వ్యర్థాల డంపింగ్‌ను అడ్డకోవాలని, ఇప్పటికే డంపింగ్ చేసిన వ్యర్థాలను తొలగించాలని వారు కోరుతున్నారు.

దశల వారీగా సమస్యలు పరిష్కరిస్తాం



సెల్ఫ్ ఫైనాన్స్‌కాలనీ సమస్యలు తెలుసుకుంటున్న కార్పొరేటర్ లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని బీఎన్‌రెడ్డినగర్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. డివిజన్ పరిధి సెల్ఫ్ ఫైనాన్స్ కాలనీలో సోమవారం జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో ఇంటెన్సివ్ శానిటేషన్, ఆర్‌డబ్ల్యూఏ ఇంట్రాక్టివ్ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి కార్పొరేటర్ హాజరై కాలనీవాసులు సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, కాలనీలోని సమస్యలను దశల వారీగా పరిష్కరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో డీఈ దామోదర్‌రావు, వాటర్‌వర్క్స్ మేనేజర్ సరివెన్నల, అధికారులు సుదర్శన్, జానకీరాం, నరేందర్‌రెడ్డి, రవీందర్, సంజీవరెడ్డి, కాలనీవాసులు వెంకట్‌రెడ్డి, సత్యనారాయణ, ప్రభాకర్‌రెడ్డి, యూనుస్, కృష్ణరెడ్డి, గోపి పాల్గొన్నారు.

మంత్రి సబితకు రుణపడి ఉంటాం

– బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక సభ్యులు



సీఎం, మంత్రి సబిత చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న బ్రహ్మణ సంఘం, బీఆర్‌ఎస్ నాయకులు

దిల్‌సుఖ్‌నగర్: మహేశ్వరం నియోజకవర్గంలో బ్రాహ్మణ భవన నిర్మాణం కోసం వేయి గజాల స్థలాన్ని మంత్రి సబితా ఇంద్రారెడ్డి కేటాయించడంపై బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక హర్షం వ్యక్తం చేసింది. ఈ మేరకు బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు, బీఆర్‌ఎస్ నాయకులు సబితారెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. సోమవారం ఆర్‌కేపురం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆ పార్టీ మహేశ్వం నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి మురుకుంట్ల అరవింద్ శర్మ, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ అయాచితం శ్రీధర్, బ్రాహ్మణ సంఘాల ఐక్యవేదిక చైర్మన్ మంగు రాఘవరావు, జనరల్ సెక్రెటరీ ప్రమోద్ కొటార్ మాట్లాడుతూ, మహేశ్వరం నియోజకవర్గంలో బ్రాహ్మణులు అధిక సంఖ్యలో ఉన్నారని, వారి కోసం బ్రాహ్మణ భవనం నిర్మించాలని తాము మంత్రికి విజ్ఞప్తి చేయడంతో వెయ్యి గజాలను కేటాయించారన్నారు. నియోజకవర్గంలోని ఐదు ఆలయాలకు.. ఒక్కోదానికి రూ. కోటి స్పెషల్ ఫండ్‌ను మంత్రి కేటాయించడం హర్షనీయమని బ్రాహ్మణ సంఘ సభ్యులు తెలిపారు. నియోజకవర్గ బ్రాహ్మణులంతా మంత్రి సబితకు రుణపడి ఉంటారని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయాలు సంస్థ డైరెక్టర్ పంతంగి మాధవి, బ్రహ్మణ సంఘం రాష్ట్ర నాయకులు తులసి శ్రీనివాస్, మునిపల్లె శ్రీనివాస్, ప్రకాష్ మధుసూదన్ రావు, యాదగిరి రావు, రఘునందన్ రావు, రాజేశ్వర శర్మ, శ్యాంసుందర్ ఆచార్యులు, రమా శంకర్, బొడ్డుపల్లి రామ్మోహన్, రామాచారి పాల్గొన్నారు.

క్రీడలతో చిన్నారుల్లో మానసికోల్లాసం పెంపు

సైదాబాద్: క్రీడలతో చిన్నారులకు శారీరక దృఢత్వంతో పాటు వారిలో మానసిక ఉల్లాసం కూడా పెంపొందుతుందని సైదాబాద్ కార్పొరేటర్ కొత్తకాపు అరుణారవీందర్‌రెడ్డి అన్నారు. సోమవారం సైదాబాద్ డివిజన్ పరిధిలోని కరణ్‌బాగ్, ఎస్‌బీహెచ్-ఏ కాలనీ, ఏకలవ్యనగర్‌లో నిర్వహించిన కార్యక్రమాల్లో కార్పొరేటర్ వేసవి కాలంలో చిన్నారులు, యువకులు ఆడుకునేందుకు అవసరమైన పలు రకాల ఆట పరికారాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చిన్నారులు సెల్‌ఫోన్లలో ఆటల కంటే ఆరుబయట ఆటలు ఆడుకోవటానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. వేసవి కాలంలో నిర్ణీత సమయాల్లో తగిన జాగ్రత్తలు పాటిస్తూ ఆడుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో బీజేపీ మలక్‌పేట నియోజకవర్గ సీనియర్ నాయకుడు కొత్తకాపు రవీందర్‌రెడ్డి, కాలనీ సంక్షేమ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


ఘనంగా అన్నమయ్య జయంత్యోత్సవం



అన్నమయ్య జయంత్యోత్సవంలో స్వర నృత్య నీరాజనం చేస్తున్న విద్యార్థులు

- 108 పదపల్లవుల స్వర- నృత్య నీరాజనానికి తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్‌లో స్థానం

వనస్థలిపురం: స్థానిక హిల్ కాలనీలోని సీతారామ చంద్రస్వామి ఆలయంలో ఆదివారం రాత్రి 108 అన్నమయ్య పదపల్లవుల స్వర-నృత్య నీరాజనం కార్యక్రమం కనుల పండువగా జరిగింది. తాళ్లపాక అన్నమాచార్య 615వ జయంత్యోత్సవం సందర్భంగా శ్రీ స్వరలయ మ్యూజిక్ అండ్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథులుగా శ్రీ త్రిదండి అహోబిల రామానుజ జీయర్ స్వామి, అన్నమయ్య భావనా వాహిని వ్యవస్థాపకులు పద్మశ్రీ డాక్టర్ శోభారాజు, ప్రముఖ నాట్యాచారులు డాక్టర్ పసుమర్తి శేషబాబు, సంగీత దర్శకులు రామాచారి తదితరులు హాజరై అన్నమయ్య కీర్తనల గొప్పతనాన్ని ఆహూతులకు వివరించారు. 108 మంది విద్యార్థులు ఒకేసారి ఒకే వేదికపై స్వర నృత్య నీరాజనం చేయడం గొప్ప విషయమ న్నారు. తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్సు ప్రతినిధులు ఈ కార్యక్రమాన్ని తెలుగు బుక్ ఆఫ్ రికార్డుగా నమోదు చేసి సంబంధిత పత్రాలను నిర్వాహకులకు అందించారు. ప్రముఖ సంగీత దర్శకుడు చల్లా దక్షిణామూర్తి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో తెలుగు బుక్ ఆఫ్ రికార్డ్స్ డైరెక్టర్ నందకిశోర్, గ్లోబల్ అడ్వయిజర్ డాక్టర్ సతీష్ శిఖ, కే.శ్రీకాంత్, సంస్థ డైరెక్టర్లు దిలీప్‌రాజన్, సౌజన్య రాజన్ పాల్గొన్నారు.



రామానుజ జీయర్ స్వామిని సత్కరిస్తున్న నిర్వాహకులు

తమ్ముడిని హత్య చేసిన అన్న అరెస్ట్



నిందితుడు మల్లేష్

చాదర్‌ఘాట్: ఆస్తి వివాదంలో తమ్ముడిని హత్య చేసిన అన్నను చాదర్‌ఘాట్ పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం ప్రకారం.. అంబర్‌పేట ప్రేమ్‌నగర్‌లో నివసించే అశోక్ మలక్‌పేటలో పిండి గిర్నీ నిర్వహిస్తున్నాడు. అతడి మొదటిభార్యకు కుమారుడు మల్లేష్ (34), ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. మొదటి భార్య చనిపోవడంతో బాలమణిని రెండో పెళ్లి చేసుకున్నాడు. వారి కుమారుడు నవీన్ (24) ఇటీవల చదువు పూర్తి చేసుకొని సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నాడు. మొదటిభార్య కుమారుడు మల్లేష్ తన పెళ్లి తర్వాత భార్యతో కలిసి ఉప్పల్‌లో ఉంటూ రామాంతపూర్‌లో టిఫిన్ సెంటర్ నిర్వహించాడు. అందులో నష్టపోయి అప్పుల పాలయ్యాడు. తిరిగి అంబర్‌పేటలోని ఇంటికి తన మకాం మార్చాడు.

అప్పులు తీర్చడానికి ఇంటిని అమ్మాల్సిందిగా తండ్రితో తరచూ వాదనకు దిగేవాడు. ఇల్లు అమ్మడానికి తండ్రి మొదట్లో అంగీకరించలేదు. ఇంతలో అశోక్ కూతురు కూడా ఆస్తిలో వాటా కావాలని కోర్టులో పిటిషన్ దాఖలు చేసింది. దాంతో ఇల్లు అమ్మితే వచ్చే సొమ్ములో రూ.50 లక్షలు ఉంచుకొని మిగిలింది ఇస్తానని తండ్రి అశోక్.. మల్లేష్‌తో చెప్పాడు. ఇల్లు అమ్మితే వచ్చే సొమ్ము మొత్తం తనకే రావాలంటే సవతి తమ్ముడు నవీన్‌ను చంపాలని అతను నిర్ణయించుకున్నాడు. ఈనెల 6న నవీన్ తండ్రికి లంచ్ బాక్స్ ఇవ్వటానికి వెళ్తుండగా మల్లేష్ తాను కూడా వస్తానని చెప్పి అతడి వాహనంపై వెనుక కూర్చున్నాడు. మలక్‌పేట మార్కెట్ సమీపంలోకి వారి వాహనం రాగానే తనతో తెచ్చుకున్న కట్టర్‌తో వెనుక నుంచి తమ్ముడి గొంతు కోసి హత్య చేసి పరారయ్యాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్న పోలీసులు సోమవారం ఉదయం గోల్నాక బ్రిడ్జ్ వద్ద సంచరిస్తున్న మల్లేష్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ రూపేష్ పర్యవేక్షణలో, మలక్‌పేట ఏసీపీ శ్యాంసుందర్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ప్రకాష్‌రెడ్డి కేసు దర్యాప్తు చేస్తున్నారు.